ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 వరంగల్
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024



భక్తులతో కిక్కిరిసిన గద్దెల ప్రాంగణం

జనం.. వనం బాట..

లక్షలాదిగా మేడారం తరలొస్తున్న భక్తులు

మహా జాతరకు సమయం సమీపిస్తోంది. బుధవారం జరిగిన మండమెలిగె పండుగతో జాతర సందడి రెట్టింపయింది. ఇప్పటికే నెలరోజులుగా ముందస్తు మొక్కులు చెల్లించుకునేందుకు సమ్మక్క, సారలమ్మ గద్దెల చెంతకు తరలొస్తుండగా.. ఆ రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. ఇప్పటివరకు 30లక్షలమంది అమ్మవార్లను దర్శించుకుని ఉంటారని, గురువారం లక్షమందికి పైగా వచ్చారని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. జనం వనం బాట పడుతుండటంతో మేడారం ప్రాంతం సందడిగా మారుతోంది. ఓ వైపు భక్తులు ఏర్పాట్లు చేసుకుంటున్న తాత్కాలిక గుడారాలు, చిరు వ్యాపారుల అంగళ్లతో కళకళలాడుతోంది. మరోవైపు 21వతేదీ నుంచి నాలుగురోజులపాటు సాగే ఈ గిరిజన కుంభమేళాకు కోటి మందికిపైగా వస్తారని అంచనా వేస్తున్న అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.



ప్రతీ జాతరలోనూ ఇలాంటి సమస్యలే..

కాలుష్య రహిత జాతర కలేనా?

పొగ, దుమ్ముతో మేడారంలో గాలి కలుషితం

- వాహనాల రద్దీ, జాతరలో వెలిగించే కట్టెల పొయ్యిలే ప్రధాన కారణం
- సాధారణ గాలికంటే 3 నుంచి 5 రెట్లు అధికంగా పొల్యూషన్
- చిన్నపిల్లలు, అస్తమా, గుండె వ్యాధి బాధితులకు తీవ్ర ఇబ్బందులు
- గ్యాస్, కమ్యూనిటీ కిచెన్లను ప్రోత్సహించాలని నిపుణుల సూచన

వరంగల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడారం మహాజాతరపై కాలుష్యం పడగ విప్పుతోంది. లక్షలాది మంది భక్తులు వచ్చే మహాజాతరలో వాహన కాలుష్యంతో పాటు దుమ్ము, కట్టెల పొయ్యి పొగ భక్తులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. సాధారణంగా పీల్చుకునే గాలి కంటే జాతర సమయంలో 3నుంచి 5రెట్లు గాలి కలుషితం అవుతుందని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. 2020, 2022లో మేడారం జాతరలో గాలితోపాటు జంపన్నవాగు నీటిపై కాలుష్య నియంత్రణ మండలి వరంగల్ బృందం పరిశోధనలు చేస్తోంది. జంపన్నవాగులో నీరు ప్రవాహం ఉండటంతో పెద్దగా కలుషితం కావటం లేదు. కానీ, గాలిలో మాత్రం కాలుష్యం విపరీతంగా పెరిగి చిన్నపిల్లలు, వృద్ధులు, గుండె, అస్తమా రోగులకు ప్రమాదకరంగా మారనుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాలుష్యం పెరగకుండా ముందు జాగ్రత్తలపై ప్రభుత్వం దృష్టిసారిస్తేనే భక్తుల ఆరోగ్యానికి భరోసా ఉంటుంది.

కాలుష్యం కట్టడికి కానరాని చర్యలు

మేడారం మహాజాతరకు ఏటా కోటిన్నర మంది భక్తులు వస్తారని ప్రభుత్వం ప్రకటిస్తుంది. అలాగే ఐదారు రాష్ట్రాల నుంచి భక్తులు 8లక్షలకు పైగా ప్రవేటు వాహనాలను మేడారం తీసుకవస్తున్నారు. వీటితో పాటు ఈ ఏడాది ఆరువేల ఆర్టీసీ బస్సులు జాతరకు రానున్నాయి. ద్విచక్ర వాహనాలు వేలల్లో జాతర దారిపట్టనున్నాయి. జాతరకు పెద్దసంఖ్యలో వచ్చే వాహనాలతో పొగ కాలుష్యం జాతరను ముంచెత్తుతుంది. వాహనాల రాకపోకలతో విపరీతమైన దుమ్ము లేచి గాలిలో కలిసిపోతుంది. ఇదే గాలిని ప్రాణవాయువుగా పీల్చుకుని భక్తులు లేనిపోని రోగాలను తెచ్చుకుంటున్నారు. మేడారం జాతర ప్రాంగణం నుంచి నార్లాపూర్, చింతల్, హెలీప్యాడ్ ప్రాంతం, కన్నెపల్లి, ఊరట్టం, జంపన్నవాగు, తాడ్వాయి వెళ్లే దారి, ఆర్టీసీ బస్టాండ్ ఏరియాల్లో వాహనాల పార్కింగులతో భారీగా దుమ్ములేస్తుంటుంది. అలాగే జాతరకు వచ్చే భక్తులు కట్టెల పొయ్యి మీద వంటలు చేసుకుంటారు. ఈ కట్టెల పొయ్యితో వచ్చే పొగ క్యాన్సర్‌కు దారి తీసే ఆ వకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ముంచెత్తుతున్న కాలుష్యం

మేడారం జాతరలో కాలుష్యం సాధారణంగా ఉండే దానికంటే అధికంగా మూడు నుంచి ఐదు రెట్లు ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా నేషనల్ యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్ (ఎన్ఏ ఏక్యూఎస్) ప్రకారం 10 పీఎం (10 మైక్రో మీటర్ల కంటే తక్కువ ఏరోడైనమిక్ వ్యాసం కలిగిన పర్టికులేట్ మ్యాటర్) కంటే 3 నుంచి 5 రెట్లు ఎక్కువగా ఉన్నట్టు కాలుష్య నియంత్రణ మండలి గుర్తించింది. 2020 మహాజాతర సందర్భంగా గాలి కాలుష్యంపై శాంపిల్స్ సేకరించారు. జాతరకు వారం ముందు, జాతర జరిగే నాలుగు రోజులు, జాతర ముగిసిన వారం రోజులకు ఈ శాంపిల్స్ సేకరించారు. గత జాతరలో గాలి నాణ్యత సూచిక (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) 50పీఎంలోపు ఉంటే లోపు ఏలాం టి ప్రమాదం ఉండదు. కానీ, 51 నుంచి 400పీఎం ఉంటే సున్నితమైన వ్యక్తులు, చిన్న పిల్లలకు శ్వాస ఇబ్బందులు ఎదురవుతాయని, ఊపిరితిత్తులు, గుండె జబ్బులు, చిన్నపిల్లలు, వృద్ధుల శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు పడుతారని, దీర్ఘకాల శ్వాసకోశ వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 401కంటే ఎక్కువ ఏక్యూ ఉంటే ఆరోగ్యవంతులు కూడా అనారోగ్యం పడే అవకాశాలు ప్పష్టంగా ఉంటాయని కాలుష్య నియంత్రణ అధికారులు పేర్కొంటున్నారు. 2020 జాతరలో గాలి నాణ్యత సూచిక 327 పీఎం నుంచి 408 వరకు నమోదైంది. సాధారణంగా కంటే 3 నుంచి 5రెట్లు అధికంగా గాలి కలుషితమైనట్లుగా అధికారులు గుర్తించారు. 2022 జాతరలో గాలి కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు శాంపిల్స్ తీయలేదని సమాచారం. ప్రస్తుతం మళ్లీ జాతరకు సంబంధించి శుక్రవారం నుంచి గాలి కాలుష్యంపై పరీక్షలు చేసేందుకు కాలుష్య నియంత్రణ మండలి సిద్ధమైంది. ప్రస్తుతం వాహనాల సంఖ్య భక్తుల సంఖ్య భారీగా పెరుగుతోంది. దీంతో ఈసారి మరింత గాలి కాలుష్యం పెరిగే అవకాశాలు ఉన్నట్లుగా పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టి పెడితేనే..

ప్రభుత్వం మహాజాతరలో ప్లాస్టిక్‌పై ఎక్కువ ఫోకస్ చేస్తుంది. ప్రతీ జాతరకు ప్లాస్టిక్ ఫ్రీ జాతర అంటూ ప్రచారం చేయడం.. జాతర ప్రాంగణం కాగానే పట్టించుకునే వారు ఉండరు. అయితే అత్యంత ప్రమాదకరమైన గాలి కాలుష్యంపై ఎవరూ దృష్టి పెట్టడం లేదు. ప్రధానంగా ఈ గాలి కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ప్రధానంగా వాహనాల రాకపోకల నేపథ్యంలో దుమ్ము లేవకుండా నిత్యం నీటిని రోడ్లపై చల్లుతూ ఉండాలని, అలాగే మురికి రోడ్లపై కంకర వేయటం, దుర్గంధం వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ఎక్కువ పొగను వెదజల్లే వాహనాలను జాతరకు రావడం కట్టడి చేయాలని, కట్టెల పొయ్యిల వంటలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు. కట్టెల పొయ్యికి బదులుగా గ్యాస్‌ను వినియోగించేలా చూడాలని, అవగాహన కల్పించటంతో పాటు చూడాలని కోరుతున్నారు. అలాగే జాతర గద్దెలకు దూరంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని, ఆ పార్కింగ్ స్థలాలు కూడా విశాలంగా ఉండటంతో పాటు అందులో తారురోడ్డు లేదా సీసీ రోడ్లు వేసేలా చర్యలు తీసుకోవాలని, దీంతో దుమ్ము లేచే అవకాశాలు తగ్గుతాయని నిపుణులు సూచిస్తున్నారు. గద్దెల సమీపంలోని హోటళ్లలో కట్టెల పొయ్యి వాడకంపై నిషేధం విధించాలని, కిరోసిన్‌తో కూడా వంటలు తయారీని నియంత్రించేలా చర్యలతో కాలుష్య ప్రభావాన్ని తగ్గించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కమ్యూనిటీ కిచెన్లను ప్రోత్సహించటంతో కూడా కొంతవరకు కాలుష్యాన్ని తగ్గించవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెడితేనే మహాజాతరలో కాలుష్యాన్ని తగ్గించి భక్తుల ఆరోగ్యాన్ని కాపాడేవీలు ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా భక్తులకు తెలియకుండానే మేడారం మహాజాతరలో కాలుష్యం విషపూరితమై మానవ జీవనంపై ప్రభావం చూపిస్తుందని, కాలుష్యాన్ని కంట్రోల్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్లాస్టిక్‌ఫ్రీ జాతరగా నిర్వహించాలి
పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

వివరాలు 4లో..

కార్యదర్శి సస్పెన్షన్

వర్ధన్నపేట, ఫిబ్రవరి 15 : విధుల్లో అలసత్వం వహించినందుకు గాను వర్ధన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(సొసైటీ) కార్యదర్శి చింతకాయల సురేష్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా సహకార అధికారి బి.సంజీవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే .. సహకార సంఘం భవనం నిర్మించడానికి గాను మండల కేంద్రంలో 2019వ సంవత్సరంలో 731/92, 731/160 సర్వే నెంబర్‌లలో రూ.69,46,398 లక్షలతో 18 గుంటల భూమిని కొనుగోలు చేశారు. అనంతరం సదరు భూమి అసైన్డ్ భూమిగా తేలడంతో సహకార శాఖ అధికారులు రైతుల నుంచి డబ్బులను తిరిగి సొసైటీకి జమ చేయాలని కార్యదర్శి సురేష్‌ను ఆదేశించారు. సదరు డబ్బులను సొసైటీకి జమ చేయడంలో కార్యదర్శి తాత్సారం చేసి కేవలం రూ.28,21,000 మాత్రమే జమ చేసినట్లు తెలిపారు. విధుల్లో అలసత్వం వహించినందుకు గాను సురేష్‌ను విధుల నుంచి తొలగించి ఇన్‌ఛార్జి బాధ్యతలను వర్ధన్నపేట కార్యదర్శి వెంకటయ్యకు అందించినట్లు సంజీవరెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, ఇన్‌సెట్లో సాత్విక్ (ఫైల్)

పాఠశాలకు వెళ్లలేదని తండ్రి మందలింపు..

ఎనిమిదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

వరంగల్ కాశిబుగ్గలో విషాదం

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 15: పాఠశాలకు వెళ్లలేదని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన ఎనిమిదో తరగతి విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన ఘటన వరంగల్‌లోని కాశిబుగ్గ రామంటవారి వీధిలో గురువారం జరిగింది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. రామంటవారి వీధికి చెందిన మెడిపెల్లి నాగరాజు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడున్నారు. కుమారుడు సాత్విక్ (13) స్థానిక నరేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. తండ్రి నాగరాజు సెలూన్‌లో పని చేస్తుండగా, తల్లి లక్ష్మి ఇళ్లలో పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సాత్విక్ కూడా పాఠశాలకు వెళ్లివచ్చిన తర్వాత సాయంత్రం సమయంలో పూలు అమ్ముతూ కుటుంబానికి తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. బుధవారం సాత్విక్ పాఠశాలకు వెళ్లకపోవడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన సాత్విక్ గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. ఇళ్లలో పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తల్లికి కుమారుడు ఫ్యానుకు వేలాడుతూ కనిపించడంతో ఆమె బోరున విలపించింది. ఇరుగుపొరుగు వారు వచ్చి ఉరితాడును తొలగించి బాలుడిని చికిత్స కోసం ఎంజీఎంకు తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఇంతజార్‌గంజ్ పోలీసులు సాత్విక్ తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. అందరితో కలుపుగోలుగా ఉంటూనేతోటివారు సాయంత్రం సమయాల్లో పూలమ్ముతూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండే సాత్విక్ మృతి చెందిన సమాచారం అందుకున్న స్థానికులు ఆతని నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. మృతిపై సాత్విక్ చదువుతున్న నరేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

కొలువుదీరిన మహాజాతర ఉత్సవ కమిటీ

- 15 మందితో ప్రమాణ స్వీకారం • హాజరైన మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 15 : మహాజాతర ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం మేడారంలో గురువారం అట్టహాసంగా జరిగింది. పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతరను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన ఉత్సవ కమిటీని నియమించింది. ఈనెల 12 నుంచి 26వరకు దీని కాలపరిమితిని నిర్ణయించింది. కమిటీ చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్, డైరెక్టర్లుగా 13 మందితోపాటు ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ప్రధాన పూజారి జగ్గారావును నియమించారు. మొత్తం 15మందితో జాతర ఉత్సవ కమిటీ కొలువుదీరింది. మంత్రి సీతక్క సమక్షంలో దేవాదాయశాఖ మేడారం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం ఈ కార్యవర్గానికి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. భక్తులకు సకల సౌకర్యాలు రూపకల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 110 కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. కోటి 50లక్షలకు పైగా భక్తజనం మహాజాతరకు తరలివచ్చి సమ్మక్క, సారలమ్మలను



సీతక్కతో.. ప్రమాణ స్వీకారం చేసిన మహాజాతర ఉత్సవ కమిటీ

తరువాయి 4లో పేజీలో..

మేడారం తాత్కాలిక బస్‌స్టేషన్ ఏర్పాట్ల పరిశీలన



బస్‌స్టేషన్ ఏర్పాట్లపై కలెక్టర్, సీపీకి వివరిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం

గిర్మాజీపేట, ఫిబ్రవరి 15 : మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ఈనెల 18 నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనున్న నేపథ్యంలో గురువారం వరంగల్ తాత్కాలిక బస్‌స్టేషన్ ఏర్పాట్లను హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్(మేడారం జాతర ఏర్పాట్ల సమన్వయ అధికారి), పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ ఎం.శ్రీలతలు పరిశీలించారు. వరంగల్ రైల్వేస్టేషన్ వద్ద ఎస్ఎస్ఎం కట్ ఎదురుగా తాత్కాలిక బస్‌స్టేషన్‌లో క్యూలైన్లు, ప్రయాణికులు కూర్చునేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. జాతర బస్ చార్జీలకు సంబంధించి వివరాలను కలెక్టర్, సీపీలకు ఆర్ఎం వివరించారు. జాతర బస్‌ల పార్కింగ్‌కు ఓ సిటీలో చేస్తున్నట్లు ఆర్ఎం చెప్పారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్, సీపీలు ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మేడారం జాతర ముగిసేవరకు వరంగల్ రైల్వే, బస్‌స్టేషన్లు, వెంకట్రామ జంక్షన్, కాశిబుగ్గ సెంటర్‌లలో తాత్కాలిక ట్రాఫిక్ నిషేధం పటిష్టంగా అమలు చేయాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. అనంతరం కలెక్టర్ తదితరులు ఓ సిటీకి వెళ్లి మేడారం జాతర బస్‌ల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు.

సకాలంలో రుణాలు అందించాలి : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 15: ప్రజలకు సకాలంలో రుణాలు మంజూరి చేసి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు తమ లక్ష్యాలను పూర్తిచేయాలని జిల్లాలోని బ్యాంకులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. వంటరులకు, స్వయం ఉపాధి మహిళా స్వయం సహాయక సంఘాల రుణాలు, ప్రాధాన్య రంగాలకు రుణాలకు మంజూరి చేయాలని తెలిపారు. పరిశ్రమలు, వెల్ఫర్‌రిపోటు ముద్ర, స్టాండప్ ఇండియా, పీఎంఈజీపీ తదితర పథకాల రుణాలను అందించాలని అన్నారు. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ఆర్థిక ప్రోత్సాహాన్ని మరింతగా పెంచాలన్నారు.

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సకాలంలో బ్యాంకు సేవలందించి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా వ్యవసాయ, స్వయం ఉపాధి, స్వయం సహాయక రుణాలు అందించాలని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.4,891 కోట్ల ప్రణాళిక తెలుపగా గత 2023-24 సంవత్సరానికి అన్ని రంగాల్లో రూ. 2,769.80 కోట్ల రుణాల మంజూరి లక్ష్యం కాగా ఇప్పటి వరకు వ్యవసాయ రంగానికి రూ.2,358 కోట్లు, పరిశ్రమలకు రూ.928 కోట్లు ఇవ్వడం జరిగిందని లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు తెలిపారు. సమావేశంలో భారతీయ రిజర్వు బ్యాంకు మేనేజర్ రాజు, డీఆర్‌డీఏ పీడీ కౌసల్యాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేష్, యూనియన్ బ్యాంక్ ఆర్ఎం సతీష్, ఆర్సీఐబ్యాంక్ ఆలీఖాన్, నాబార్డు డీఎం చంద్రశేఖర్, ఎస్బీఐ డిప్యూటీ మేనేజర్ దుర్గాప్రసాద్, ఏపీజీవీబీ ఆర్. శ్రీధర్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నర్సింహామూర్తి, పశు సంవర్ధక శాఖ జేడీ బాలకృష్ణ పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో నివేదిక విడుదల చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

- బాలల హక్కుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బాలల సంరక్షణ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన బాలల చట్టాల అమలు వంటి అంశాల్లో తీసుకుంటున్న చర్యలపై గురువారం కలెక్టర్ తన చాంబర్‌లో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూడు నెలల కాలంలో ఐదు కమిటీల ద్వారా 88 మంది బాలలకు రక్షణ కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ అధికారి ఎం.శారద, కమిటీ మెంబర్లు బి.రాజలీల, ఎ.పద్మ, సంపత్, సుజాత పాల్గొన్నారు.
- జిల్లాలోని పట్టభద్రులందరూ ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు మార్చి 14 లోపు ఫాం -18 ద్వారా నత్వరమే తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న డ్రాఫ్ట్ ఓటరు జాబితా క్రెయిమ్ అభ్యంతరాలు స్వీకరిస్తామని 29 లోపు అభ్యంతరాలను పరిష్కరించి ఏప్రిల్ 4న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని కలెక్టర్ తెలిపారు.

బారులు తీరిన భక్తులు.. రద్దీగా మారిన గద్దెలు

● మేడారంలో కొనసాగిన దర్శనాలు ● లక్షకు పైగా తరలివచ్చిన భక్తజనం

మేడారం, ఫిబ్రవరి 15: మేడారం సమ్మక్క, సారలమ్మలను భక్తులు గురువారం భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. తెలంగాణలోని నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా తరలివచ్చారు. వనదేవతల గద్దెలను నేరుగా దర్శించుకొని ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టల వద్ద తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం శివసత్తుల పూనకాలు, సమ్మక్క, సారలమ్మలకు జేజేలు పలుకుతూ డోలు వాయిద్యాల నడుమ తల్లుల గద్దెలకు చేరుకున్నారు. క్యూలైన్ల ద్వారా తల్లులను దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారం(బెల్లం), పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారె సమర్పించారు. కొబ్బరికాయలను కొట్టి యాట మొక్కులను చెల్లించుకున్నారు. తమ కోరికలను తీర్చాలని వనదేతలను వేడుకున్నారు. మేడారం పరిసరాల్లోని వసతి షెడ్లలో, అటవీ ప్రాంతాల్లోని చెట్లకింద వంటలు చేసుకొని ఆనందంగా గడిపారు. భక్తులు గురువారం లక్షకు పైగా దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు.

ఇప్పటి వరకు 30 లక్షల మంది

మహాజాతర నేపథ్యంలో మేడారంలో భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటివరకు సుమారు 30 లక్షల మంది వనదేతలను దర్శించుకుని ఉంటారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. మహాజాతరకు సుమారు రెండు నెలల ముందుగానే భక్తులు మేడారం వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు.


జంపన్నవాగులో శివసత్తుల పూనకాలు


జంపన్నవాగులో పుణ్యస్నానాలు


పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



బంగారంతో వెళుతున్న మహిళలు

కొలువుదీరిన మహాజాతర ఉత్సవ కమిటీ

(3వ పేజీ తరువాయి)

దర్శించుకుంటారని అన్నారు. ఇప్పటికే 30లక్షలకు పైగా మంది భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారని అన్నారు. ములుగు జిల్లా కోసం పోరాడిన ముంజాల భిక్షపతితో పాటుగా జాతర అభివృద్ధికి పాటుపడిన వారికే ఉత్సవ కమిటీలో స్థానం దక్కిందన్నారు. జాతర విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలను కోరారు.

ప్రమాణ స్వీకారం చేసిన వారు వీరే..

చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్, డైరెక్టర్ మిలుకూరి ఐలయ్య, కొండి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణ సింగ్, ముంజాల భిక్షపతి, సుంచు హైమావతి, చామర్తి కిశోర్, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అబ్బయ్య, అంకం కృష్ణస్వామి, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయి జగ్గారావు ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు.

ప్లాస్టిక్‌ఫ్రీ జాతరగా నిర్వహించాలి

పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 15 : మేడారం మహాజాతరను ప్లాస్టిక్ ఫ్రీగా నిర్వహించాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కోరారు. మేడారంలో ఆమె గురువారం పర్యటించారు. ముందుగా వనదేవతలను దర్శించుకొని చీరె, సారె సమర్పించారు. పారిశుధ్య నిర్వహణపై మేడారంలోని హరిత హోటల్ సమావేశ గదిలో కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి పంచాయతీరాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్‌తో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జాతర సమయం దగ్గర పడుతున్న తరుణంలో భక్తుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోందన్నారు. అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ముఖ్యంగా భక్తులకు నిరంతరం తాగునీరు అందించాలని అన్నారు. జాతరలో, జాతర ముగిసిన అనంతరం కూడా ముమ్మరంగా పారిశుధ్య పనులు కొనసాగించాలన్నారు.

పంచాయతీరాజ్ కమిషనర్ అనితరామచంద్రన్ మాట్లాడుతూ.. జాతరలో నిర్వర్తించే అధికారులు చిత్తశుద్ధితో సమన్వయంతో భక్తులకు సేవలు అందించాలని అన్నారు. జాతరలో ముఖ్యంగా గద్దెల ప్రాంగణంలో బెల్లం, కొబ్బరికాయలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. పారిశుధ్య సిబ్బంది, యంత్రాల ద్వారా నిరంతరం విధులు నిర్వర్తించాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. వివిధ జిల్లాల నుంచి జాతర విధులకు వచ్చే అధికారులు తప్పనిసారిగా ఈనెల 19న సంబంధిత జోనల్ అధికారులకు రిపోర్ట్ చేయాలని అన్నారు. మహాజాతరలో పారిశుధ్య పనులు చేయడానికి 10సెక్టార్లు 60సబ్ సెక్టార్లుగా విభజించినట్టు తెలిపారు. డీపీవో, డీఎల్‌పీవోల ఆధ్వర్యంలో పారిశుధ్య పనుల జరుగుతాయని అన్నారు. ఫీల్డ్‌లో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులకు కేటాయించిన జోన్లలో విధులు నిర్వర్తించాలని అన్నారు. ప్రతి జోన్‌కు ఎంపీవో స్థాయి అధికారిని కేటాయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శబరీశ్, డీపీవోలు, డీఎల్‌పీవోలు, వివిధ జోన్ అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన వైద్య సేవలు

హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్


మేడారంలోని ప్రధాన వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న రవీంద్ర నాయక్

మేడారం, ఫిబ్రవరి 15: మేడారం సమ్మక్క సారలమ్మల మహాజాతర సందర్భంగా అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హెల్త్ డైరక్టర్ రవీంద్ర నాయక్ అన్నారు. వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్ శివప్రాసద్‌తో కలిసి జాతర పరిసరాల్లోని వైద్య శిబిరాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా భక్తులకు అందిస్తున్న సేవల గురించి డీఎంహెచ్‌వో అప్పయ్యను అడిగి తెలుసుకున్నారు. టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ప్రధాన తాత్కాలిక ఆస్పత్రిని సందర్శించారు. అక్కడ వైద్యం పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్యులతో మాట్లాడుతూ మహాజాతర సందర్భంగా భక్తులకు మెరుగైన వైద్యసేవలు అదించాలన్నారు. సరిపడా మందులను నిల్వ చేసుకోవాలన్నారు. అనంతరం సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట డీసీహెచ్ జగదీశ్వర్, ఏటూరునాగారం సూపరిండెంట్ డాక్టర్ సురేష్, డాక్టర్ ప్రేమ్‌సింగ్, డాక్టర్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై నేడు సమీక్ష

హనుమకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్ నగరంలో ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం వరంగల్ ఐఎంఏ హాలులో జరిగే ఈ సమీక్షా సమావేశానికి హనుమకొండ, వరంగల్ జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వివిధ ప్రోగ్రాం అధికారులు పాల్గొననున్నారు. జాతీయ కార్యక్రమాల అమలును సమీక్షించనున్నారు. డీహెచ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ రవీంద్రనాయక్ నగరంలో సమీక్షలో పాల్గొంటున్నారు. రెండు జిల్లాలకు చెందిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆహార నాణ్యత అధికారుల తనిఖీలు

మేడారం, ఫిబ్రవరి 15: మహాజాతర నేపథ్యంలో ఆహార నాణ్యత అధికారులు మేడారంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. వందల సంఖ్యలో వెలిసిన దుకాణాల్లోని ఆహార పదార్థాలను, తినుబండారాలను పరిశీలించారు. నాణ్యమైన ఆహారం భక్తులకు అందించాలని వ్యాపారులకు సూచించారు. కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఫుడ్ సేఫ్టీ అధికారులు అమృత శ్రీ, బాపుజీ, కృష్ణమూర్తి, రోహిత్‌రెడ్డి, వాసూరాం, ఎస్.అనూష, ఆర్.అనూష, ప్రత్యూష మేడారం జాతరలో విడివిడిగా తనిఖీలు చేశారు. రకరకాల రంగులు కలిపిన పదార్థాలను పరిశీలించారు. బాగా మరిగిన నూనెలు సమారు 15 లీటర్ల వరకు పారబోశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

గిర్మాజీపేట,ఫిబ్రవరి15 : వరంగల్-కాజీపేట మార్గంలోని దర్గా రైల్వేగేటు సమీపం లో గురువారం ఉదయం కాజీపేట నుంచి వరంగల్ వెళ్తున్న పుష్‌పుల్ రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి (48) ఆత్మహత్య చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ జీ.నరేష్ తెలిపారు. మృతుడు 5 అడుగుల 4 అంగుళాల ఎత్తు, నలుపు రంగు శరీరం, ఛాతి ఎడమ వైపు పుట్టుమచ్చ కలిగి బక్క పలుచగా ఉన్నాడని తెలిపారు. అలాగే బ్లాక్ అండ్ రెడ్ కలర్ స్వెట్టర్, బ్లాక్ కలర్ షార్ట్, కాళ్లకు ప్లాస్టిక్ బ్లాక్ కలర్ షూస్ ధరించి ఉన్నాడని, ఎలాంటి ఆధారాలు మృతుడి వద్ద లభించలేదన్నారు.

మృతదేహాన్ని మార్చురిలో భద్రపరిచి హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు దర్యాప్తు చేస్తున్నారన్నారు. మృతుడికి సంబంధీకులు 9441557232/9959425483 నంబర్లల్లో సంప్రదించాలని పోలీసులు కోరారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

ఉద్యోగాలు పొందిన వారు

అంకితభావంతో పనిచేయాలి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 15: ట్రైబల్, సోషల్, బీసీ వెల్ఫేర్ సంక్షేమ గురుకులాల్లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వహించి మంచి పేరు తీసుకురావాలని జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే కోరారు. జిల్లాలో సంక్షేమ గురుకులాల్లో కొలువులు పొందిన 42మందికి హైదరాబాద్‌లో సీఎం రేవంత్ చేతుల మీదుగా నియామక పత్రాలు తీసుకోవడానికి ప్రత్యేక బస్సులో వెళ్లారు. ఈ బస్సును జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో అడిషనల్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈవో రాంరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ఆర్‌సీవో మనోహర్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ మంగ మల్లయ్య, సోషల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ జి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

మానవహక్కులను సద్వినియోగం చేసుకోవాలి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సహీరాభాను

ఖిలావరంగల్, ఫిబ్రవరి 15: సమాజంలో జరిగే అవినీతి, అన్యాయాలను ఎదుర్కోవడానికి మానవ హక్కులు దోహదపడతాయని జాతీయ వినియోగదారుల -మానవహక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ అధ్యక్షురాలు డాక్టర్ సహీరాభాను అన్నారు. గురువారం శివనగర్‌లో మానవ హక్కుల సమితి వరంగల్ ఉమ్మడి జిల్లాలో నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధితులు మానవహక్కులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరంగల్ జిల్లా, నగరంలో కార్యవర్గం ఎప్పటికీ సిద్ధంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఉప్పల సురేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు కుసుమ రాజు, జనరల్ సెక్రెటరీ దూదాటి మోహన్‌రావు, ఎమ్డీ యూనస్, చింతల నవీన్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయండి



దేశవ్యాప్త బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 15: నేడు దేశవ్యాప్తంగా జరిగే కార్మిక, గ్రామీణ భారత్ బంద్‌ను విజయమవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గన్నారపు రమేష్ అన్నారు. గురువారం లేబర్‌కాలనీ వంద ఫీట్ల రోడ్ వద్ద ఎమ్డీ యాకూబ్ అధ్యక్షతన బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పుల్ల రమేష్, నాయకులు నాగరాజు, భిక్షపతి, తిరుపతి, బాబురావు, నారాయణ, మోహన్, కొమురమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'నిట్'లో 16 నుంచి అథ్లెటిక్స్

కాజీపేట, ఫిబ్రవరి 15: వరంగల్ నిట్‌లో ఈనెల 16 నుంచి 18 వరకు అథ్లెటిక్స్, ఖోఖో, టోర్నమెంట్స్ నిర్వహించనున్నట్లు నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ దయానిధి తెలిపారు. దేశంలోని వివిధ నిట్‌ల నుంచి 796 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ అథ్లెట్, అర్జున అవార్డు గ్రహీత జోసఫ్ జి. భాస్కర్ హాజరుకానున్నట్లు తెలిపారు.



ఏటీవీఎం మిషన్, ఏటీవీఎం ద్వారా ప్రయాణికుడికి టికెట్ ఇస్తున్న రైల్వే సిబ్బంది

డిజిటల్ చెల్లింపులు

● వరంగల్ రైల్వేస్టేషన్‌లో జనరల్ టికెట్ల జారీ ● ఆటోమోటెడ్ టికెట్ వెండింగ్ మెషిన్‌లో క్యూఆర్ కోడ్ సాయంతో..
● యూటీఎస్ యాప్‌తో సెల్‌ఫోన్‌లోనే జనరల్ టికెట్ ● కౌంటర్‌లో మొబైల్ నెంబర్ ద్వారానూ చెల్లింపు సౌలభ్యం

గిర్మాజీపేట, ఫిబ్రవరి 15: జనరల్ టికెట్‌తో రైల్ ప్రయాణం కంటే రైల్వేస్టేషన్‌లో టికెట్ కోసం ప్రయాణికులు పడే తిప్పలే ఎక్కువ. జనరల్ టికెట్ కోసం గంట ముందుగా రైల్వేస్టేషన్‌కు రావడం, చాతాడంత క్యూ వారి సహనాన్ని పరీక్షిస్తోంది. ప్రయాణికుల ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు రైల్వేశాఖ పలు డిజిటల్ చెల్లింపులను అమలు చేస్తోంది. దీంతో స్మార్ట్‌ఫోన్, బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులుంటే యూటీఎస్ యాప్‌తో స్మార్ట్ ఫోన్‌లో జనరల్ టికెట్, పేమెంట్ యాప్‌ల క్యూఆర్ కోడ్‌తో ఏటీవీఎం ద్వారా టికెట్, టికెట్ కౌంటర్‌లోనూ మొబైల్ నెంబర్‌తో డబ్బులు చెల్లించి టికెట్ కొనుగోలు చేసే డిజిటల్ చెల్లింపుల సదుపాయం వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఇటీవల అందుబాటులోకి వచ్చింది. వరంగల్ రైల్వేస్టేషన్ మీదుగా 63జతల సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. చెన్నై-న్యూఢిల్లీ, చెన్నై-హైదరాబాద్ మార్గంలో ప్రయాణించే రైళ్లన్నీ వరంగల్‌లో హాల్టింగ్ ఉన్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వరంగల్‌కు సుమారు 50 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు.

యూటీఎస్ యాప్‌తో టికెట్లు..

వరంగల్ రైల్వేస్టేషన్‌లో వరంగల్ వైపు 5, శివనగర్ వైపు ఒకటి కలిపి మొత్తం ఆరు టికెట్ కౌంటర్లు ఉన్నాయి. కౌంటర్ల వద్ద పెద్ద సంఖ్యలో క్యూలో నిలబడి టికెట్ తీసుకున్నా.. ఒక్కోసారి టికెట్ పోను మిగతా చిల్లర అందుబాటులో లేకపోవడం ప్రయాణికులు, ఇటు రైల్వే సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని అధిగమించేందుకు రైల్వేశాఖ యూటీఎస్(అన్ రిజర్వ్‌డ్ టికెట్ సిస్టం)యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో స్మార్ట్‌ఫోన్‌లో జనరల్ టికెట్ పొందవచ్చు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

యూటీఎస్ యాప్‌ను ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి, ఐఫోన్ వినియోగదారులు యాప్ స్టోర్, విండోస్ ఫోన్ వినియోగదారులు విండోస్ యాప్ స్టోర్‌ల నుంచి రైల్వే యూటీఎస్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. డౌన్‌లోడ్ చేసుకున్న యాప్ ఓపెన్ చేసి మొబైల్ నెంబర్, పేరు, పాస్‌వర్డు, పుట్టిన తేది నమోదు చేస్తే మొబైల్‌కు వన్ టైం పాస్‌వర్డు (ఓటీపీ) వస్తుంది. ఈ ఓటీపీని నమోదు చేయడం ద్వారా రైల్వే యూటీఎస్ యాప్ మన మొబైల్‌లో అందుబాటులోకి వస్తుంది. మొబైల్ నెంబర్, పాస్‌వర్డుతో రైల్వే యూటీఎస్ అకౌంట్‌లోకి లాగిన్ కాగానే యూటీఎస్ ఆన్ రిజర్వుడ్ (యూటీఎస్‌ఐఆర్) టికెట్ కనిపిస్తుంది. ఇందులో మనం వెళ్లాల్సిన స్టేషన్, కావాల్సిన టికెట్లు, పేపర్ లెస్ టికెట్ అని యాప్‌లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో డెబిట్/క్రెడిట్ కార్డులు/ ఇంటర్నెట్ బ్యాంకింగ్ తదితర డిజిటల్ పేమెంట్ చేయగానే స్మార్ట్‌ఫోన్‌లో జనరల్ స్మార్ట్(పేపర్ లెస్) టికెట్లు డౌన్‌లోడ్ అవుతాయి. ఒకవేళ పేపర్ టికెట్ కావాలనుకుంటే యాప్‌లో ఆన్‌లైన్ పేమెంట్ చేశాక రైల్వేస్టేషన్‌లోని ఆటోమోటెడ్ టికెట్ వెండింగ్ మిషన్‌లో మొబైల్ నెంబర్, బుకింగ్ ఐడి నమోదు చేసి టికెట్లు పొందవచ్చు. రైల్వేస్టేషన్ నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పడే యూటీఎస్ యాప్ ద్వారా జనరల్ టికెట్ పొందవచ్చు.

ఆటోమోటెడ్ టికెట్ వెండింగ్ మిషన్ ద్వారా...

వరంగల్ రైల్వేస్టేషన్‌లో వరంగల్ వైపు 5, శివనగర్ వైపు 1 మొత్తం 6 ఆటోమోటెడ్ టికెట్ వెండింగ్ మిషన్‌లు ఉన్నాయి. ఏటీవీఎంల టచ్ స్క్రీన్‌పై ప్రింట్ మొబైల్ టికెట్, ప్లాట్‌ఫాం టికెట్, బుక్ జర్నీ టికెట్ వెళ్లాల్సిన రైల్వే స్టేషన్, ఎక్స్‌ప్రెస్/సూపర్ ఫాస్ట్ రైలు తదితర వివరాలు నమోదు చేయాలని కావాల్సిన టికెట్‌ల డబ్బులను టచ్‌స్క్రీన్‌పై కనిపించే క్యూఆర్ కోడ్‌కు గూగుల్ పే/ఫోన్ పే తదితర డిజిటల్ పేమెంట్ యాప్‌లతో స్కాన్ చేయగానే టికెట్ ప్రింట్ అయి బయటకు వస్తుంది. అయితే ఏటీవీఎం వినియోగం ద్వారా ప్రయాణికులే నేరుగా టికెట్ తీసుకునేందుకు అక్కడ ఉండే కమర్షియల్ సిబ్బంది సహకరిస్తారు.

మొబైల్ నెంబర్ ద్వారా డబ్బులు చెల్లింపు..

దగ్గర నగదు డబ్బులు లేనప్పుడు, స్మార్ట్ ఫోన్, బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు ఉంటే టికెట్ కౌంటర్‌లోనూ మొబైల్ నెంబర్ ద్వారా జనరల్ టికెట్‌లు కొనుగోలు చేయవచ్చు. సహజంగానే క్యూలో నిలబడి కౌంటర్ వద్ద మనవంతు రాగానే సిబ్బందికి వెళ్లాల్సిన స్టేషన్, రైలు పేరు, కావాల్సిన టికెట్లు చెప్పాలి. వాటికి అయ్యే డబ్బుల పేమెంట్ కోసం మన మొబైల్ నెంబర్ కౌంటర్‌లోని సిబ్బందికి చెప్పగానే మన మొబైల్‌కు పేమెంట్ లింక్ వస్తుంది. ఆ లింక్ క్లిక్ చేసి గూగూల్ పే/ఫోన్ పే తదితర పేమెంట్ ద్వారా డబ్బు చెల్లింపు అవుతుంది. దీంతో టికెట్ కౌంటర్ కంప్యూటర్‌పై పేమెంట్ క్లియర్ కాగానే కౌంటర్ సిబ్బంది టికెట్‌లను ప్రయాణికులకు ఇస్తారు.

వరంగల్ రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం అమలులో ఉన్న యూటీఎస్ యాప్, క్యూఆర్ కోడ్‌తో ఏటీవీఎం మిషన్, కౌంటర్‌లో మొబైల్ ద్వారా చెల్లింపు మూడు రకాల డిజిటల్ చెల్లింపులతో ప్రయాణికులు తాము వెళ్లే రోజు జనరల్ టికెట్‌ను సులువుగా కొనుగోలు చేయడం ద్వారా సమయం ఆదా చేసుకోవచ్చని రైల్వే అధికారులు చెబుతున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

నిజామాబాద్ ఎంపీ అర్వింద్



ఎంపీ అర్వింద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గంటా రవికుమార్

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 15: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకొని బీజేపీ సత్తా చాటాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ అన్నారు. గురువారం వరంగల్ ఓసిటీలోని ఆ పార్టీ నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా అర్వింద్‌ను ప్రదీప్‌రావు-రేణుక దంపతులు సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. వరంగల్ ఎంపీ స్థానాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినీత్‌రావు, విజయ్‌చందర్‌రెడ్డి, పుప్పాల రజనీకాంత్, సిద్ధం నరేష్ పాల్గొన్నారు.

వరంగల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఎంపీ అరవింద్‌ను జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

● శంభునిపేట: వరంగల్ పర్యటనకు వచ్చిన నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌ను ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కార్యాలయంలో రంగశాయిపేట ఆల్ కాలనీస్ అధ్యక్షుడు గురువారం కలిశారు. ఖిలా వరంగల్ కోట చుట్టూ దశాబ్దాల క్రితం నిర్మించుకున్న ఇళ్లకు పురావస్తు శాఖ అధికారులు పర్మిషన్‌లు ఇవ్వటం లేదని తెలిపారు. కోట చుట్టూ 100 మీటర్లు బఫర్ జోన్‌గా గుర్తించి మిగతా ఇళ్లకు పర్మిషన్ ఇవ్వాలని కోరుతూ వినతి పత్రాన్ని ఇచ్చారు.

టెన్త్ పరీక్షలపై సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

ఏకశిలానగర్, ఫిబ్రవరి 15: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసే దిశగా వడుప్సా వరంగల్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కరీమాబాద్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య సలహాదారు ఎన్.వెంకటేశ్వర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, కోడెం శ్రీధర్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థులను పరీక్షల్లో ఒత్తిడి తగ్గించేలా ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలన్నారు. పరీక్షల నిర్వహణ తీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వడుప్సాకు చెందిన వందకుపైగా పాఠశాలల్లోని 2 వేల మంది విద్యార్థులకు సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వడుప్సా వరంగల్ జిల్లా బాధ్యులు ఆడెపు వెంకటేశ్వర్లు, ముక్కెర రవీందర్, దాసి సతీష్ మూర్తి, కూచన క్రాంతి కుమార్, టి.జ్ఞానేశ్వర్ సింగ్, పొన్నోజు చక్రపాణి, కే. వెంకన్న పాల్గొన్నారు.

గ్రామదేవతలకు కొనసాగుతున్న మొక్కులు



బొడ్రాయి గద్దె వద్ద దర్శించుకుంటున్న భక్తులు

శంభునిపేట, ఫిబ్రవరి 15: రంగశాయిపేటలో బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన జరుగగా గురువారం బొడ్రాయి గద్దె పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. శంభునిపేట నుంచి బొడ్రాయి వరకు భక్తులు, రామాలయం వద్ద భక్తులు, విక్రయ కేంద్రాలతో జాతరను తలపించింది. మహంకాళీ ఆలయంతోపాటు ప్రధాన హోమ మండపంలో అమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా ఎంపీ వద్దిరాజు రవి చంద్ర సోదరుడు వెంకన్న గురువారం గ్రామదేవతను దర్శించుకున్నారు. రూ.1.5 లక్షల విరాళాన్ని ఉత్సవ నిర్వాహాలకు అందించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ రంగశాయిపేట యూత్ ఫోర్స్ సభ్యులను అభినందించి సత్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఉత్సవాల్లో పాల్గొని విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో గ్రామ పురోహితులు వెలిదె భార్గవ శర్మ, ప్రదీప్ శాస్త్రి, కార్పొరేటర్ గుండు చందన, ఉత్సవ కన్వీనర్‌లు కొల్లూరి యోగానంద్, కేడల జనార్దన్, గుండు పూర్ణచందర్, నాయిని అశోక్, చందా మనోహర్ పాల్గొన్నారు.

శ్రీరంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 15: కాశిబుగ్గ శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో శ్రీవేంకటేశ్వర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రెండో రోజు గురువారం ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి ఆధ్వర్యంలో మహా సుదర్శన యాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు ఆరుట్ల క్రిష్ణమచార్యులు మాట్లాడుతూ.. సుదర్శన యాగంతో సమస్త దోషాలు తొలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి చిలుపూరి సురేష్, కోశాధికారి సుల్తాన సమ్మక్క, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈలు చేస్తున్న కృషి అభినందనీయం

రాష్ట్ర పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వెంకటేశం



వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న వెంకటేశం

కాజీపేట జంక్షన్, ఫిబ్రవరి 15: మైక్రో, స్మాల్, మీడియం, ఎంటర్‌ప్రైజెస్‌ల ప్రయోజనం కోసం వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలను నిర్వహించడంలో ఎంఎస్‌ఎంఈ చేస్తున్న కృషిని పరిశ్రమల శాఖ రాష్ట్ర జనరల్ మేనేజర్ జె. వెంకటేశం అభినందించారు. ఎంఎస్‌ఎంఈ భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ హైదరాబాద్, హనుమకొండ జిల్లా పరిశ్రమల కేంద్రాల సహకారంతో హనుమకొండలోని హరిత హోటల్‌లో గురువారం నిర్వహించిన వెండర్ డెవలప్‌మెంట్ ప్రారంభ వేడుక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.

హనుమకొండ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ హరిప్రసాద్, వరంగల్ జిల్లా జనరల్ మేనేజర్ నర్సింహమూర్తి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను వివరించారు. ఎంఎస్‌ఎంఈ ఉత్పత్తుల కోసం గ్లోబల్ ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను సులభతరం చేయడం హర్షణీయమని హరిప్రసాద్ అన్నారు.

ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శివరామప్రసాద్ మాట్లాడుతూ.. ఎంఎస్‌ఎంఈల వ్యాపార వృద్ధి నైపుణ్యం పెంపుదల, మార్కెటింగ్ సౌకర్యాలు, సబ్సిడీ రుణాలను పొందడం కోసం ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. హనుమకొండ లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్వయం సహాయక బృందాల ద్వారా మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించి ఎంఎస్‌ఎంఈలకు ప్రయోజనం చేకూర్చేందుకు రూపొందించిన వివిధ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఖాదీ గ్రామ పరిశ్రమల బోర్డు ప్రాంతీయ అధికారి అశోక్ తమ సంస్థ అందిస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగుతుందని తెలిపారు.

మూడో రోజుకు చేరిన శ్రీవేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు

మట్టెవాడ, ఫిబ్రవరి 15: రంగరంగ వైభవంగా కొనసాగుతున్న శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. బట్టలబజార్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం తోమాల సేవ, ఆరాధన, సహస్ర నామార్చన, హోమం నిర్వహించారు. సాయంత్రం హంసవాహన సేవ, శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం, నాట్య కళాక్షేత్ర ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో ఎలపాటి రత్నాకర్‌రెడ్డి, వంశ పరంపర్య ఛైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు,ఉత్సవ సేవా సమితి సభ్యులు గందె గోవిందరాజులు పాల్గొన్నారు.

పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

బీజేపీ పార్లమెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ మార్తినేని ధర్మారావు



సమావేశంలో మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 15: రానున్న పార్లమెంట్ ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని, అధిష్ఠానం సూచించిన కార్యక్రమాలను పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ పార్లమెంట్ క్లస్టర్ ఇన్‌చార్జి మార్తినేని ధర్మారావు అన్నారు. వరంగల్ దేశాయిపేట రోడ్డులోని పార్టీ కార్యాలయంలో గురువారం తూర్పు నియోజకవర్గ అసెంబ్లీ ప్రవాస్ యోజన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడు తూ త్వరలో జరిగే బస్సు యాత్రను విజయవంతం చేయాలని, ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేసి వరంగల్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్‌షా, బాకం హరిశంకర్, వన్నాల వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు రథసప్తమి..

● సూర్యభగవానుడి జయంతి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● కొత్త కోడళ్లకు చీరల బహూకరణ
● అమ్మవార్లకు పసుపు కుంకుమ, పాలకాయ బంగారాలు
● ఇంటింటా సమ్మక్క మొక్కులు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 15: మాఘమాసం శుక్ల పక్షం 7వ రోజు సప్తమి తిథి నాడు రథ సప్తమి పర్వదినాన్ని నిర్వహించుకుంటారు. సూర్య భగవానుడు రథ సప్తమి రోజున తన రథాన్ని అధిరోహించి ప్రపంచానికి వెలుగు అందించాడని, ఇదే రోజు సూర్యభగవానుడి జయంతిగా జరుపుకుంటారు. ఈ రోజున సూర్యుడిని పూజిస్తే రోగ బాధల నుంచి విముక్తి కలిగి,, పాపపరిహారం జరుగుతుందని నమ్ముతారు. ప్రత్యేక నది స్నానాలు ఆచరిస్తారు. నెయ్యితో ఆలయాల్లో దీపం వెలిగించి ఎర్రటి పూలతో అర్చన నిర్వహిస్తారు. ఆదిత్య హృదయాన్ని పారాయణం చేస్తే విజయం కలుగుతుందని భక్తులు ప్రత్యేకంగా రథ సప్తమిని నిర్వహిస్తారు. రథ సప్తమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వాహన సేవలు నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఇంటింటా సమ్మక్క మొక్కులు..

సప్తమి తిథి నుంచి మరో ఐదు రోజుల్లో సమ్మక్క సారలమ్మ మహా జాతర జరగనుంది. ఈనేపథ్యంలో భక్తులు తమ ఇంటిలో సమ్మక్క దేవతను పూజించుకోవడం ఆచారంగా వస్తోంది. రథ సప్తమి రోజున అమ్మవార్లిద్దరికి పసుపు, కుంకుమలతో కుడుకలుపోకలు ఖర్జూర పండ్లతో ఒడి బియ్యాలు పోసి కొత్త చీరలను పెట్టి అమ్మవారికి పాల కొబ్బరికాయలను కొట్టి బెల్లం (బంగారాన్ని) అమ్మవారికి ప్రీతిగా సమర్పిస్తారు. గొర్రెలు, మేకలు, కోళ్లను కొందరు బలి ఇచ్చి సమ్మక్క దేవతను చేసుకుంటారు.

మరికొందరు జంతు బలి లేకుండా దేవత పూజలు నిర్వహించుకుంటారు. ఇంటిల్లిపాలి బంధు మిత్రులను పిలుచుకొని విందు భోజనాలు చేసుకుంటారు. అలాగే రథ సప్తమి రోజున అత్తవారింట్లో కొత్త కోడళ్లకు చీరలను అందిస్తారు. ప్రతీ ఇంటిలో మహిళలు రథ సప్తమి రోజున కొత్త వస్త్రాలను ధరించడం, పూజలు చేయడం ఆనవాయితీ.



సూర్యనారాయణ స్వామి(ఫైల్)



వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

చెరువుల తూములకు మరమ్మతులు చేపట్టాలి

దుగ్గొండి, ఫిబ్రవరి 15 : మండలంలోని తిమ్మంపేట గుండం చెరువు, దామెర చెరువు, నాం చెరువు తూముల లికేజీ తో సాగునీరు వృథాగా పోవడంతో ఆయ కట్టు రైతులు కొంత కాలం నుంచి ఆందోళన చెందుతున్నారు. చెరువులు వర్షం నీటితో నిండినప్పటికీ లికేజీ కారణంగా నీరు పంటలకు అంద లేదని గతంలో పలుసార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినా మరమ్మతులకు నోచుకోలేదు. గ్రామంలో గురువారం గ్రామ సభ నిర్వహించగా రైతులు గొర్రె సంజీవరెడ్డి, దాసి నవీన్‌లతో పాటు పలువురు గ్రామ ప్రత్యేక అధికారి దయాకర్ కు వినతి పత్రం అందించారు. ఆ గ్రామ సభలో ఎంపీటీసీ మాలోతు చంద్రు, కార్యదర్శి రమేశ్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



తూముల మరమ్మతులు చేపట్టాలని వినతి పత్రం అందిస్తున్న రైతులు

సేవాలాల్ చూపిన మార్గం ఆదర్శనీయం

• జయంతి వేడుకలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి


సేవాలాల్ ఆలయం వద్ద సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట, ఫిబ్రవరి 15 : బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని మాధన్నపేటరోడ్‌లో గల సేవాలాల్ ఆలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో గురువారం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకోసం, బంజారాల అభ్యున్నతి కొరకు సేవాలాల్ చూపిన మార్గం ఆదర్శనీయమని అన్నారు. బంజారా జాతి అభివృద్ధికి, తండాల నిర్మాణానికి సేవాలాల్ చేసిన కృషిని కొనియాడారు. సేవాలాల్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. సేవాలాల్ ఆలయం వద్ద కమిటీ సభ్యులు, బంజారా నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ససేవాలాల్ ఆలయ కమిటీ నియోజకవర్గ చైర్మన్ భూక్య గోపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శి అజ్మీర శంకర్ నాయక్, గౌరవ అధ్యక్షులు లక్ష్మన్‌నాయక్, జెత్‌రాంనాయక్, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోకల శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు వేముల సాంబయ్యగౌడ్, బత్తిని రాజేందర్, ఎలకంటి విజయ్ కుమార్, ఓబీసీసెల్ అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, భైరి మురళితో పాటు నియోజకవర్గంలోని బంజారా నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

• మునిసిపల్ కార్యాలయంలో...

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ బి.శ్రీనివాస్‌తో కలిసి చైర్‌పర్సన్ గుంటి రజని, కౌన్సిలర్లు సేవాలాల్ మహారాజ్ చి త్ర పటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బంజారా అభివృద్ధికి సేవాలాల్ చేసిన కృషిని వారు కొనియాడారు. ప్రజల కోసం అనేక ఉద్యమాలు చేపట్టారని అందులో పెరిఫర్ ఉద్యమం ఒకటని చైర్‌పర్సన్ రజని అన్నారు. ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మతమార్పిడిలు అరికట్టడానికి సేవాలాల్ కృషి చేశారన్నారు. కార్య క్రమంలో కౌన్సిలర్లు రాయిడి కీర్తిరెడ్డి, ఎండి.మహబూబ్‌పాషా, టీపీఎఫ్ వీరస్వామి, ఎంపఈ శాంతిస్వరూప్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ బానోతునాగరాజు, మాజీ కౌన్సిలర్ గుంటి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

• ఖానాపురం : లంబాడాల ఆరాధ్య దైవం, సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అశోక్‌నగర్ గిరిజన సైనిక్ స్కూల్‌లో పాఠశాల డైరెక్టర్ శ్రీనివాసరావు, హిందీ ఉపాధ్యాయుడు గుగులోతు కిషన్ ఆధ్వర్యంలో, కొత్తూరు తండాలో ఉద్యోగుల యూనియ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నైవేద్యం సమర్పించి భక్తి శ్రద్ధలతో వేడుకలను జరుపుకున్నారు. బంజారాల అభివృద్ధికి సేవాలాల్ చేసిన కృషిని కొనియాడారు. సైనిక్ స్కూల్‌లో సేవాలాల్ జీవిత చరిత్రను ఉపాధ్యాయుడు కిషన్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జాటోతు ఫకీరా, అజ్మీరాజు, కుమార్, రామకోటి, జీవన్ నాయక్, భాస్కర్, రామన్న, చందు పాల్గొన్నారు.


నర్సంపేటలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు

• పర్వతగిరి : గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ జయంతి వేడు కలను స్వేరోస్ పర్వతగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని గిరిజన బాలుర పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.సేవాలాల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి బంజారా సాంప్రదాయ పద్ధతుల్లో కార్యక్రమాలను నిర్వహిం చారు. ఈసందర్భంగా స్వేరోస్ జిల్లా జనరల్ సెక్రటరీ గారె జయరాజ్ మాట్లాడుతూ బంజారా ప్రజల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషిచేసిన మహా నీయుడు సేవాలాల్ మహరాజ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రవిలాల్, ఉపాధ్యాయులు సురేష్, మోహన్, సాంబయ్య, రవీందర్, రవి, స్వేరోస్ నాయకులు బానోత్ రమేష్, చిన్నపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నిధుల వినియోగం ఎలా?

• కమిటీల రద్దుతో అయోమయం



వర్ధన్నపేట, ఫిబ్రవరి 15 : ఎస్‌ఎంసీ కమిటీ ఎన్నికలకు బ్రేక్ పడటంతోపాటు ప్రస్తుతం కొనసాగుతున్న కమిటీలను రద్దు చేయడంతో పాఠశాల నిధుల వినియోగం ఎలా అన్న అయోమయం నెలకొంది. పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలను జనవరి 29వ తేదీన నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించిన విషయం విదితమే. ప్రభుత్వ పాఠశాలల్లో కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని రకాల చర్యలు చేపట్టారు. గత నెల 20న నోటిఫికేషన్లు జారీ చేసి విద్యార్థుల తల్లిదండ్రుల జాబితా నోటీసు బోర్డులో పెట్టారు. 22వ తేదీన తల్లి దండ్రుల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, 24న తల్లిదండ్రులు తుది జాబితాను విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేయగా ఎన్నికలను నిలిపివేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. చివరగా 2019 డిసెంబరులో ఎస్‌ఎంసీ కమిటీల గడువు ముగిసినా గత ప్రభుత్వం వీటి పదవీ కాలాన్ని పొడిగిస్తూ వచ్చింది. పొడిగింపు కమిటీల గడువు కూడా గత ఏడాది డిసెంబరు 31వ తేదీతోనే ముగిసింది.జనవరి 29న నూతన కమిటీల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కానీ, ప్రస్తుత విద్యా సంవత్సరం మరో మూడు నెల్లో ముగుస్తుండంతో, కొత్త విద్యా సంవత్సరం ప్రారంభంలో పాఠశాల విద్యా కమిటీల ఎన్నికలు నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరడంతో ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియను నిలిపి వేసినట్లు తెలుస్తోంది. ఒకవేళ వచ్చే విద్యా సంవత్సరంలో నిర్వహిస్తే మరో ఐదు నెలల వరకు విద్యా ఆగాల్సి ఉంటుంది. ప్రస్తుతం పాఠశాలలకు మంజూరయ్యే కాంపోజిట్ గ్రాంట్ నిధుల వినియోగానికి ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లకు జాయింట్ చెక్ పవర్ ఉంది. మన ఊరు, మన బడి పనులు నడుస్తున్న పాఠశాలల్లో నిధుల వినియోగంలో కమిటీల పాత్ర కీలకం.పాత కమిటీలను రద్దుచేసినా ప్రభుత్వం జాయింట్ చెక్ పవర్ ఎవరికి ఇవ్వాలనే విషయంలో స్పష్టం ఇవ్వకపోవడంతో ప్రధానోపాధ్యాయులు అయోమయానికి గురవుతున్నారు.ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చే వరకు పాఠశాలల నిర్వహణకు నిధుల వినియోగంపై అనిశ్చితి నెలకొనే అవకాశాలు ఉన్నాయని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి.

నేటి సమ్మెను విజయవంతం చేయాలి

• కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


నర్సంపేటలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నర్సంపేట, ఫిబ్రవరి 15 : నేటి సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలో గురు వారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని జయలక్ష్మి సెంటర్, అంబే ద్కర్ సెంటర్, అంగడి సెంటర్ మీదుగా అమర వీరు ల స్థూపం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా కేం ద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొరబోయిన కుమారస్వామి, ఐఎఫ్‌టియూన్యూ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేషం, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుంపెల్లి మునీశ్వర్ పిలుపు నిచ్చారు. కార్య క్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అనంతగిరి రవి, జిల్లా కమిటీ సభ్యుడు హన్మకొండ శ్రీధర్, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల ైడి, ఏఐఎస్‌టీయూ న్యూ జిల్లా కార్యదర్శి ఎల్లన్న, భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు రుద్రారపు పైడయ్య, హమాలీ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు బొల్లం ప్రసాద్, డివైఎఫ్ఐ పట్టణ కార్య దర్శి బాలకృష్ణ, కందికొండరాజు, జనార్దన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

• నెక్కొండ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసన గా ఈ నెల 16వ తేదిన దేశ వ్యాప్తంగా నిర్వహించే కార్మిక సమ్మె గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐటీయుసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు కోరారు. గురువారం నెక్కొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత స్వతంత్రానికి పూర్వం కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను సవరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం కార్మిక లోకానికి అన్యాయంచేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులఐక్యతను చాటడానికి అధికసంఖ్యలో కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

• సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు...

చెన్నారావుపేట : కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేశ వ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతూ ప్రకటిస్తున్నట్లు ప్రైవేట్ స్కూల్స్ డ్రైవర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు పాశం మల్లికార్జున్ అన్నారు. గురువారం మం డల కేంద్రంలో సిద్దార్థ ప్రిన్సిపాల్ అండెం కర్నాకర్‌రెడ్డికి సమ్మె నోటీసులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీరును పూర్తి గా నిరసించడం జరిగిందన్నారు. కార్మికులందరూ సమ్మెకు విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్క రాజు, టేకుల స్వామి, బాదావత్ రమేష్, అన్నబోయిన అనిల్, టేకుల స్వామి, బాదావత్ రమేష్, ప్రశాంత్, సునిల్, ముప్పిడి స్వామి, అనిల్, వీరన్న, వెంకన్న, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘంలో నిధులు దుర్వినియోగం కాలేదు

• సీఈవోకు చైర్మన్, డైరెక్టర్ల వినతి


వరంగల్‌లో సీఈవో సంజీవరెడ్డికి వినతి పత్రం అందిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు తదితరులు

దుగ్గొండి, ఫిబ్రవరి 15 : మండలంలోని నాచినపల్లి సహకార సంఘంలో నిధులు దుర్వినియోగం కాలేదని, ఎంబీ రికార్డుల ప్రకారమే అభివృద్ధి పనులకు నిధులు వినియోగించడం జరిగిందని చైర్మన్ సుకినే రాజేశ్వర్‌రావు, డైరెక్టర్లు గురువారం జిల్లా సహకార సంఘం సీఈవో సంజీవరెడ్డికి వినతి పత్రం అందించారు. ఇటీవల వైస్ చైర్మన్, కొంత మంది డైరెక్టర్లు సంఘం నిధులు దర్వినియోగం చేశారని సీఈవోకు ఫిర్యాదు చేశారు. మండలంలోని నాచినపల్లి, తిమ్మంపేట గ్రామాలకు 500మెట్రిక్ టన్నులు ధాన్యం నిల్వ చేసే గోదాములు మంజూరీ కాగా, నాచినపల్లి గోదాము నిర్మాణం మధ్యలో నిలిపే వేయగా, నిర్మాణం చేయడం జరిగిందని, తిమ్మంపేటలో పునాదిలేవల్లో పనులు చేపట్టి ఆపనుల వరకే ఎంబీ రికార్డుల ప్రకారమే రూ.6లక్షలు విడుదల చేయడం జరిగిందని, పనులు కాకుండా నిధులు డ్రాచేయలేదని ఫిర్యాదులో తెలిపారు. సహకార సంఘం చుట్టూ ఫినిషింగ్ పనులు తీర్మానం ప్రకారమే చేయడం జరిగిందని, నిధుల విడుదల కమిటీలో సీఈవో, చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఉంటారని చేసిన పనులకే నిధులు వినియోగించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. తిమ్మంపేట గోదాము నిర్మాణం చేసేవిధంగా తీర్మానం చేయడం జరిగిందని పనులు చేస్తామని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో డైరెక్టర్లు అజ్మీర సాంబయ్య, నరహరి భాస్కర్‌రెడ్డి, గోసంగి పురుషోత్తం, సంజీవరావు, లలిత బాయి, సదానందం, రాజు, సూరయ్యలు ఉన్నారు.

పోలీసు విధులపై అవగాహన


విద్యార్థులకు పోలీసు విధులపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

దుగ్గొండి, ఫిబ్రవరి 15 : పోలీసులు రోజు వారీగా చేస్తున్న విధులపై స్థానిక పాఠశాల విద్యార్థులకు గురువారం పోలీసు స్టేషన్‌లో ఎస్సై పరమేశ్ వివరించారు. ప్రజలు ఆపదలో ఉన్నపుడు పోలీసుల పని తీరు, అన్ని రకాలుగా పోలీసు యత్రాంగం పని చేయడం జరుగుతుందని, విద్యార్థులు ఆపదలో ఉన్నపుడు పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థికి సన్మానం


విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల చైర్మన్

చెన్నారావుపేట, ఫిబ్రవరి 15: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా విద్యా శాఖ, టీఎస్ కాస్ట్ వారీ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా సైన్స్ సెంటర్‌లో వివిధ అంశాల పై నిర్వహించిన పోటీల్లో మండల కేంద్రంలోని సిద్దార్థ హై స్కూల్ లో చదువుతున్న మర్రి ధరణిప్రియ కవిత్వంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థిని ధరణిప్రియాతో పాటు ఇన్‌స్పైయిర్‌లో పాల్గొన్న నాంపెల్లి అక్షయ, ముద్దునూరి మానసలకు ప్రశంస పత్రంతో పాటు షీల్డ్ అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అండెం కర్నాకర్‌రెడ్డి, గైడ్ టీచర్ దామెర గణేష్, మేడి రమేష్‌గౌడ్, జక్కుల జగదీశ్వర్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్


సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

నర్సంపేట, ఫిబ్రవరి 15 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతులను చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల క్లస్టర్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, మహబూబాబా ద్ పార్లమెంట్ నియోజకవర్గ నాయకుడు ప్రభారి సత్యపాల్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, నియోజకవర్గం లో పార్టీ బలోపేతానికి పాల్పడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహ రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, రత్నం సతీష్, కంభంపాటి పుల్లారావు, గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు భరత్‌వీర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు కల్యాణి, కౌన్సిలర్ రాజు, గోల్యానాయక్, గూడూరు సందీప్, మనీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొందరు బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు.

నేడు రథ సప్తమి..

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 15 : మాఘమాసం శుక్ల పక్షం 7వ రోజు సప్తమి తిథినాడు రథ సప్తమి పర్వదినాన్ని నిర్వహించుకుంటారు. సూర్య భగవానుడు రథసప్తమి రోజున తన రథాన్ని అధిరోహించి ప్రపంచానికి వెలుగు అందించాడని, ఇదే రోజు సూర్యభగవానుడి జయంతిగా జరుపుకుంటారు. ఈ రోజున సూర్యుడిని పూజిస్తే రోగబాధల నుంచి విముక్తి కలిగి, పాపపరిహారం జరుగుతుందని నమ్ముతారు. ప్రత్యేక నది స్నానాలు ఆచరిస్తారు. నెయ్యితో ఆలయాల్లో దీపం వెలిగించి ఎర్రటి పూలతో అర్చన నిర్వహిస్తారు. ఆదిత్య హృదయాన్ని పారాయణం చేస్తే విజయం కలుగుతుందని భక్తులు ప్రత్యేకంగా రథ సప్తమిని నిర్వహిస్తారు. రథ సప్తమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వాహన సేవలు నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

• ఇంటింటా సమ్మక్క మొక్కులు..

సప్తమి తిథి నుంచి మరో ఐదు రోజుల్లో సమ్మక్క సారలమ్మ మహా జాతర జరగనుంది. ఈనేపథ్యంలో భక్తులు తమ ఇంటిలో సమ్మక్క దేవతను పూజించుకోవడం ఆచారంగా వస్తోంది. రథ సప్తమి రోజున అమ్మవార్లిద్దరికి పసుపు, కుంకుమలతో కుడుకలుపోకలు ఖర్జూర పండ్లతో ఒడి బియ్యాలు పోసి కొత్త చీరలను పెట్టి అమ్మవారికి పాల కొబ్బరికాయలను కొట్టి బెల్లిం(బంగారాన్ని) అమ్మవారికి ప్రీతిగా సమర్పిస్తారు. గొర్రెలు, మేకలు, కోళ్లను కొందరు బలి ఇచ్చి సమ్మక్క దేవతను చేసుకుంటారు. మరికొందరు జంతు బలి లేకుండా దేవత పూజలు నిర్వహించుకుంటారు. ఇంటిల్లిపాలి బంధు మిత్రులను పిలుచుకొని విందు భోజనాలు చేసుకుంటారు. అలాగే రథ సప్తమి రోజున అత్తవారింట్లో కొత్త కోడళ్లకు చీరలను అందిస్తారు. ప్రతీ ఇంటిలో మహిళలు రథ సప్తమి రోజున కొత్త వస్త్రాలను ధరించడం, పూజలు చేయడం ఆనవాయితీ.

బాల్య వివాహాలను అరికట్టాలి

నెక్కొండ, ఫిబ్రవరి 15 : గ్రామాల్లో నిరక్షరాస్యత కారణంగా బాల్య వివాహాలను జరిపిస్తుంటారని, అక్షరాస్యులు బాల్య వివాహాలను అరికట్టడానికి సహకరించాలని నెక్కొండ సీఐ చంద్రమోహన్ కోరారు. మండలంలోని పెద్దకొర్పోలు గ్రామంలో గురువారం రాత్రి జాగృతి పోలీసు కళాబృందం ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. యువత గంజాయి, గుట్కా, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దన్నారు. గ్రామాల్లో దొంగతనాలను, నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై షేక్ జాన్‌పాషా, గ్రామ తాజా మాజీ సర్పంచ్ మహమ్మద్ షైబుబ్‌పాషా, పోలీసు కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

గిర్మాజీపేట, ఫిబ్రవరి 15 : వరంగల్ - కాజీపేట మార్గంలోని దర్గా రైల్వేగేటు సమీపంలో గురువారం ఉదయం కాజీపేట నుంచి వరంగల్ వెళ్తున్న పుష్‌పుల్ రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి (48) ఆత్మహత్య చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ తెలిపారు. మృతుడు 5 అడుగుల 4 అంగుళాల ఎత్తు, నలుపు రంగు శరీరం, ఛాతి ఎడమ వైపు పుట్టుమచ్చ కలిగి బక్క పలుచగా ఉన్నాడని తెలిపారు. అలాగే బ్లాక్ అండ్ రెడ్ కలర్ స్వెటర్, బ్లాక్ కలర్ షార్ట్, కాళ్లకు ప్లాస్టిక్ బ్లాక్ కలర్ షూస్ ధరించి ఉన్నాడని, ఎలాంటి ఆధారాలు మృతుడి వద్ద లభించలేదన్నారు. మృతదేహాన్ని మార్చురిలో భద్రపరిచి హెడ్ కానిస్టేబుల్ పి.రాజు దర్యాప్తు చేస్తున్నారన్నారు. మృతుడికి సంబంధీకులు 9441557232 / 9959425483 నంబర్లల్లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

సెల్‌ఫోన్ అప్పగింత

వర్ధన్నపేట, ఫిబ్రవరి 15 : మండలంలోని రామవరం గ్రామానికి చెందిన మధు ఆర్టీసీ బస్సులో వరంగల్ వెళుతుండగా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ విషయంపై వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్‌చేసి సెల్‌ఫోన్ కొనుగొన్నారు. బాధితుడికి గురువారం వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సెల్‌ఫోన్ అప్పగించారు.

ఆటో డ్రైవర్లకు జీవనభృతి చెల్లించాలి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 15 : ఆటో డ్రైవర్లకు జీవనభృతి కింద నెలకు రూ.15వేలు చెల్లించాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సరైన కిరాయి లేక ఆటో డ్రైవర్లు కిస్తీలు కట్టలేక, కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంలో ఆలోచించి ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రాగంపేటలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

ఖానాపురం, ఫిబ్రవరి 15 : మండలంలోని రాగంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం వైభ వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు భైరబోయిన ఐలేష్, భైరబోయిన సంతోష్, అన్నెబోయిన ఎల్లయ్య, నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల కమిటీ


నూతనంగా ఎన్నికైన కమిటీ

చెన్నారావుపేట, ఫిబ్రవరి 15 : మండలంలో తెలంగాణ ఉద్యమంలో 2001 నుంచి తెలంగాణ సాధన కోసం కృషి చేసిన ఉద్యమకారుల నూతన కమిటీని గురువారం ఎన్నుకు న్నారు. మండల అధ్యక్షుడిగా ఉప్పునూతుల లింగామూర్తి, గౌరవ అధ్యక్షుడిగా అంగోతు వీరాసింగ్, ఉపాధ్యక్షుడిగా ఉడ్డుల సాంబయ్య ప్రధాన కార్యదర్శిగా బానోతు గణేష్, సహాయ కార్యదర్శిగా శీలం రాజు, కోశాధికారిగా సింగారపు సునీల్, జిల్లా ఉపాధ్యక్షుడిగా మల్లాటి వీరారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కౌడగాని రాజవీరులను ఎన్నుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులకు జరిగిన అన్యాయంపై పోరాటం చేస్తామన్నారు.

విద్యతోపాటు క్రమశిక్షణ అవసరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ జాన్‌పాషా

నెక్కొండ, ఫిబ్రవరి 15 : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని క్రమ శిక్షణ కలిగిన విద్యార్థులే విద్యలో రాణించి సమాజానికి వారి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకువస్తారని నెక్కొండ ఎస్సై షెక్ జాన్‌పాషా అన్నారు. నెక్కొండలోని ఆదర్శ పాఠశాలలో గురువారం పదో తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు వారి విద్యా జీవితంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్య ఎంతో కీలకమని, విద్యార్థులు వారి జీవితానికి బంగారు బాటలువేయాలన్నా, ముండ్ల బాటలు నిర్మాణం చేసుకోవాలన్నా ఈ సమయం ఎంతో కీలకమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్సై సూచించారు. వీడ్కోలుతో దూరమవుతున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొని కలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రణయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న సుజిత

దుగ్గొండి, ఫిబ్రవరి 15 : బాలికలకు కల్పించిన హక్కులపై పూర్తి అవగాన కలిగి ఉండాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా హబ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ సుజిత తెలిపారు. దుగ్గొండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం హెచ్‌ఎం రామస్వామి అధ్యక్షతన బాలసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సుజిత మాట్లాడుతూ బాలికల కోసం ప్రభుత్వాలు అనేక హక్కులను చట్టాల రూపకంగా తెచ్చారని, వాటిని ఆపదలో ఉన్నపుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బేటీ బచావో బేటీ బడావో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పరమేశ్, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎంపీపీని కలిసిన ఎంపీడీవో


ఎంపీపీ కాట్ల కోమలను కలిసిన ఎంపీడీవో అరుంధతి

దుగ్గొండి, ఫిబ్రవరి 15 : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బదిలీపై వచ్చి నూతనంగా బాధ్యతలు చేపట్టిన లెక్కల అరుందతి గురువారం ఎంపీపీ కాట్ల కోమలను కలిసి, పుష్ప గుచ్ఛం అందించి, అభినందనలు తెలిపారు. కలసిన వారిలో ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, సూపరింటెండెంట్ రవికుమార్, వీరన్న సిబ్బంది ఉన్నారు.